

ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి, ఇతర అధికారులు
ఫొటో: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

సీఎం గారూ... మా బతుకులు బాగు చేయండి

రక్తదానం చేసిన మాదిగ చర్మకార సంఘాల జేఏసీ, మాదిగ సామాజిక వర్గం



కేక్ కట్‌చేస్తున్న మాదిగ చర్మకార జేఏసీ నేతలు

పంజాగుట్ట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'సీఎం రేవంత్‌రెడ్డి గారూ.. మా బతుకులు బాగు చేయండని' మాదిగ చర్మకార సంఘాల జేఏసీ రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. సీఎం పుట్టిన రోజు సందర్భంగా వారు కేక్‌కట్ చేశారు. రెడ్‌క్రాస్ సహకారంతో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జిల్లాల నుంచి వచ్చిన మాదిగ జేఏసీ నాయకులు, మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు శుక్రవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి దేవని సతీష్ మాదిగ మాట్లాడుతూ చెప్పులు, బూట్లు వేసుకున్న కాళ్ల అభివృద్ధిలో ముందుకుసాగుతున్నాయి, తెలంగాణాలో చెప్పులు కుట్టే మాదిగలు మాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారన్నారు. గచ్చిబౌలిలో 42 ఎకరాలలో లిడ్‌క్యాప్ ఏర్పాటు చేశారని, తెలంగాణలోని పలు జిల్లాల్లో స్థలాలు కేటాయించి, లిడ్‌క్యాప్ పరిశ్రమలు ఏర్పాటు చేసినా, 20 ఏళ్లుగా ఆ పరిశ్రమలు మూతబడి యంత్రాలు పూర్తిగా పనికి రాకుండా పోయాయన్నారు. మూసీ పునరుజ్జీవానికి పాదయాత్ర చేస్తున్న సీఎం, మాదిగల అభివృద్ధికి తెలంగాణలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి అందులో మాదిగలకు చెప్పులు, బూట్ల తయారీలో శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం తెలంగాణ మాదిగ చర్మకార సంఘాల జేఏసీ కమిటీ వేశారు. సమావేశంలో జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ఇ. మురళీ దర్శన్, ప్రధాన సలహాదారు చింత స్వామి మాదిగ, కన్వీనర్ కూసపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణిస్తున్న అక్కాచెల్లెళ్లు

- యూసుఫ్‌గూడ అజ్జు కుటుంబంలో 'దంగల్' స్టోరీ
- రెజ్లింగ్‌లో సత్తాచాటుతున్న శ్రావణి, లోక్షిత
- ప్రభుత్వం సహకారం అందించాలని విజ్ఞప్తి

యూసుఫ్‌గూడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాను సాధించాలనుకున్నది తన బిడ్డలతోనైనా నెరవేర్చుకోవాలనుకున్నాడు ఆ తండ్రి.. తండ్రి కోరికనే తమ ఆశయంగా మలుచుకుని ముందుకు సాగారు ఆ కుమార్తెలు. సంకల్పాన్నే శక్తిగా మార్చుకుని నిరంతరం కఠోర శ్రమతో జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదిగారు. బస్తీలో పేదకుటుంబంలో పుట్టినా కుస్తీ(రెజ్లింగ్) క్రీడలో రాణిస్తూ అంచలంచలుగా ఎదుగుతున్న ఆ యువతుల ప్రతిభ అభినందనీయం, ఆదర్శనీయం. యూసుఫ్‌గూడ లక్ష్మీనర్సింహ నగర్‌కు చెందిన మందా శ్రావణి, లోక్షిత గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

దంగల్ సినిమాను తలపించేలా..

లక్ష్మీనర్సింహ నగర్‌కు చెందిన అజ్జుకు చిన్నప్పటి నుంచి రెజ్లింగ్‌పై ఆసక్తితో నిరంతరం సాధన చేశాడు. అయితే తాను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనే కోరిక ఉన్నా కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా దిశగా అడుగులు వేయలేకపోయాడు. వివాహం తర్వాత బాబు పుడితే కొడుకునైనా మంచి రెజ్లర్‌గా చేయాలని కలలు కన్నాడు. కానీ ఇద్దరు అమ్మాయిలు పుట్టారు. అయితే చిన్నతనం నుంచి తన పిల్లలను నిశితంగా పరిశీలించాడు. వారిలోనూ కుస్తీ క్రీడలో పోరాడే లక్షణాలున్నాయని గ్రహించి శిక్షణ ఇవ్వడం మొదలెట్టాడు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో శిక్షణకు చేర్పించాడు. ఇద్దరు అమ్మాయిలు తండ్రి కోరికను తమ ఆశయంగా తీసుకుని నిరంతర సాధనతో జాతీయ స్థాయికి క్రీడాకారులుగా ఎదిగారు. దంగల్ సినిమాను తలపించే ఈ తండ్రీకూతుళ్ల ప్రస్థానం అబ్బురపరుస్తోంది.. ఆదర్శంగా నిలుస్తోంది.

ఇద్దరూ ఇద్దరే..

పదేళ్ల వయసులో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో కుస్తీ శిక్షణలో చేరిన శ్రావణి(19) అక్కడ కోచ్‌గా ఉన్న క్యాతం శ్రీకాంత్‌యాదవ్ వద్ద తర్ఫీదు పొందుతూ పలు పోటీలలో పాల్గొని సత్తా చాటుతూ వచ్చింది. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలలో మూడుసార్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన బాలికల 49 కేజీల విభాగంలో స్వర్ణపతకం సాధించింది. అదే సంవత్సరం హింద్ కేసరి సీనియర్ నేషనల్స్‌లో పాల్గొని కాంస్య పతకం గెలుచుకుంది. 2023లో అత్తాపూర్ రామ్‌లీలా గ్రౌండ్స్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఐదో సర్దార్ వల్లభాయ్ పటేల్ మహిళా కేసరి పోటీల్లో 65 కేజీల విభాగంలో బంగారు పతకం అందుకుంది. ఈ ఏడాది జూన్‌లో తమిళనాడు సేలంలో నిర్వహించిన జాతీయస్థాయి సౌత్ ఇండియా అండర్-23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సొంతం చేసుకుంది. దాదాపు పదిసార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తూ తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది శ్రావణి. తెలంగాణలో 65 కేజీల విభాగంలో శ్రావణి ప్రథమ స్థానంలో ఉంది. ప్రస్తుతం 17 ఏళ్ల వయసున్న శ్రావణి చెల్లి లోక్షిత సైతం పలు విభాగాలలో సత్తా చాటి ఇప్పటికి మూడు సార్లు జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైంది. అండర్-17 విభాగంలో పలు పతకాలు సాధించింది. రాష్ట్రంలో 46 కేజీల రెజ్లింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది.



సాధించిన పతకాలతో అక్కాచెల్లెళ్లు శ్రావణి, లోక్షిత

ఒలింపిక్స్‌లో పాల్గొనాలని ఉంది: శ్రావణి, లోక్షిత



సర్దార్ వల్లభాయ్‌పటేల్ ఉమెన్ కేసరి పతకంతో శ్రావణి

ఒలింపిక్స్‌లో పాల్గొని మెడల్ సాధించడం తమ లక్ష్యమని ఈ అక్కాచెల్లెల్లు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. అయితే పేదకుటుంబం కావడంతో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కోవాల్సి వస్తుంది. కుస్తీ శిక్షణలో భాగంగా క్రమం తప్పకుండా వ్యాయామంతో పాటు ప్రత్యేకమైన ఆహార నియమాలు పాటించాల్సిన అవసరం ఉంది. ఇటు చదువు అటు సాధన చేయడంతో పాటు పోటీల్లో పాల్గొనేందుకు పలు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండటంతో ఆర్థిక పరిస్థితులు సహకరించడం లేదని వారు చెబుతున్నారు.

ఇప్పటి వరకు తమకు చిన్న శ్రీశైలంయాదవ్, నవీన్‌యాదవ్, కొల్లా కుమార్‌యాదవ్, సాయికిరణ్‌యాదవ్ సహకారం అందిస్తూ వచ్చారని. చదువులకు, పోటీలకు వారే చేయూత అందిస్తున్నారని చెప్పారు. కోచ్ సహకారంతో నైపుణ్యాలను అందిపుచ్చుకుంటున్నామని, ప్రభుత్వ సహకారం తోడైతే మరింతగా రాణిస్తామని శ్రావణి, లోక్షిత అంటున్నారు. ప్రస్తుతం ఈ అక్కాచెల్లెల్లు ఇంటర్ చదువుతున్నారు.



డీఎంఈకి బాధ్యతలు స్వీకరించిన పత్రాన్ని అందజేస్తున్న శ్రీభూషన్‌రాజు

జీవన్‌దాన్ నోడల్ అధికారిగా డాక్టర్ శ్రీభూషణ్ రాజు బాధ్యతలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ నెఫ్రాలజీ విభాగం అధిపతి డాక్టర్ శ్రీభూషణ్ రాజు జీవన్‌దాన్ నోడల్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం డీఎంఈ కార్యాలయంలో డీఎంఈ డాక్టర్ ఎన్ వాణిని కలిసి సంబంధిత పత్రాన్ని ఆయనకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవయదాన మార్పిడిని పెంచేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. నిమ్స్‌తోపాటు, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో అవయదాన మార్పిడిల సంఖ్యను పెంచుతామన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి నిమ్స్, ఉస్మానియా ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడిని శుక్రవారం చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు శ్రీ భూషణ్ రాజును అభినందించారు.

దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి పీఏ సెల్‌ఫోన్ చోరీ

బంజారాహిల్స్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి పీఏ సెల్‌ఫోన్ చోరీకి గురైనది. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల 31న జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో దీపావళి పండుగ సందర్భంగా క్వార్టర్ నెంబర్ 7లో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శితోపాటు అతడి పీఏ సతీష్‌కుమార్ వచ్చారు. పూజలు ముగిసిన తర్వాత జేబులో చూసుకోగా పీఏ సతీష్‌కుమార్ శ్యామ్సంగ్ గెలాక్సీ ఏ-35 ఫోన్ కనిపించలేదు. గురువారం రాత్రి బంజారాహిల్స్ స్టేషన్‌కు వచ్చి పీఏ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాలసీపై వడ్డీలేని రుణం అంటూ.. రూ.1.73 లక్షలు కాజేత

హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మీరు తీసుకున్న ఇన్సూరెన్స్ పాలసీపై వడ్డీ లేని రుణం ఇస్తామని నమ్మబలికిన సైబర్ నేరగాళ్లు రూ.1.73 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన వ్యాపారి(62)కి సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి తాము బజాజ్ ఫైనాన్స్ సంస్థ నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. మీరు ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుంటే వడ్డీ లేకుండా రూ.10 లక్షల వరకు రుణం ఇస్తామని, అందుకు సంబంధించిన వివరాలను వాట్సాప్ చేశారు. ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ నుంచి "గ్యారెంటీడ్ పెన్షన్ ప్లాన్" తీసుకోవాలని సూచించారు. ఇన్సూరెన్స్ పాలసీకి సంబంధించి రూ.80 వేలు ప్రీమియం కట్టాలని చెప్పి తమ ఖాతాలో జమ చేయించుకున్నారు. తర్వాత లోన్‌కు సంబంధించి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తప్పనిసరి అని చెప్పి మరో రూ.56 వేలు బదిలీ చేయించుకున్నారు. ఇలా పలు కారణాలు చెబుతూ ఆగస్టు 9 నుంచి నవంబర్ 3 వరకు పలు దఫాలుగా రూ. 1.73 లక్షలు వసూలు చేశారు. మూడు నెలలైనా లోన్ రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రక్తదానం.. పాలు, పండ్లు పంపిణీ

- ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు



నిమ్స్‌లో రక్తదానం చేస్తున్న కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి

బంజారాహిల్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్‌నంబర్ 11లో సికింద్రాబాద్ డీసీసీ ఉపాధ్యక్షుడు కొప్పిశెట్టి గోవింద్‌రావు ఆధ్వర్యంలో భారీకేక్ కట్‌చేసి, బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శులు ముంజగళ్ల విజయ్‌కుమార్, మచ్చ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. ప్రజాక్షేత్రంలోనే ఉండాలలనే సంకల్పంతో సీఎం రేవంత్ పుట్టినరోజు కూడా మూసీ ప్రాంతంలో పాదయాత్ర చేస్తుండటం అభినందనీయమన్నా రు. కార్యక్రమంలో భీమ్‌రావు, నజీర్, రమణ, అప్పారావు, పూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలి

పంజాగుట్ట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తోందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్ రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం నిమ్స్ ఆస్పత్రిలో వెంగళరావునగర్ కాలనీ యూత్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన రక్తదానం చేశారు. సీఎం రేవంత్ ఇలాంటి పుట్టిన రోజులు మరిన్ని జరుపుకొని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెట్ ఆఫ్ ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్ డాక్టర్ ఎం.పుష్పజ, ఆస్పత్రి సిబ్బంది, వెంగళరావునగర్ కాలనీ యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

ఖైరతాబాద్,నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి ఎం మధుకర్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టేషనరీ, జనరల్ నాలెడ్జి పుస్తకాలను 200 మందికి ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం మార్కెట్ చౌరస్తాలోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.కృష్ణ యాదవ్, ఆవుల అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు చీరెలు, దుప్పట్లు

ఖైరతాబాద్/బేగంపేట్/ అమీర్‌పేట/ ఎర్రగడ్డ/ యూసుఫ్‌గూడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి ఆధ్వర్యంలో ఏసీ గార్డ్స్‌లోని మైనారిటీ రెసిడెన్షియల్ గర్ల్స్ పాఠశాలలో విద్యార్థులకు మంచినీటి బాటిళ్లను పంపిణీ చేశారు. రేవంత్ సర్కార్ ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. బేగంపేటలోని పాఠశాల విద్యార్థుల మధ్య కాంగ్రెస్ నాయకులు సీఎం పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ సత్యం శ్రీరంగం, అమరం శ్రీనివాస్‌రెడ్డి, రమేష్ తదితరులు కేక్‌కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు. ప్రకాశ్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకుడు నాయకుడు విశాల్ సూదం తదితరులు రక్తదానం చేశారు. అమీర్‌పేట కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అమీర్‌పేట హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్ఆర్‌నగర్‌లోని దివ్యాంగుల ఆశ్రమంలో ఉదయం చిన్నారులకు పాలు, పండ్లు, మధ్యాహ్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బిస్కెట్లను సాయంత్రం ఎస్ఆర్‌నగర్‌లో పారిశుధ్య కార్మికులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ యాదవ్, నవీన్, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



బేగంపేటలోని పాఠశాలలో చిన్నారుల మధ్య కేక్‌కట్ చేస్తున్న సత్యం శ్రీరంగం

హేమవతినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో

కాంగ్రెస్ నాయకులు దూడల రవిగౌడ్, ఎర్ర కృష్ణకుమార్, గంటా మల్లేష్, మొహమ్మద్ సర్దార్, సురేష్ గౌడ్, యాకమ్మ తదితరులు విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

బేగంపేట గగన్‌విహార్ కాలనీలోని ఆశా కుటీర్ ఆశ్రమంలో సామాజిక సేవకుడు రమేష్ కొడిచర్ల అంధ పిల్లలకు కటింగ్ చేశారు.



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టేషనరీ, జనరల్ నాలెడ్జి పుస్తకాలను అందజేస్తున్న టీపీసీసీ కార్యదర్శి మధుకర్ యాదవ్



తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో కేక్‌కట్ చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని ఏడీఈ జీ. గోపీ తెలిపారు. స్టార్ ఆసుపత్రి ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 10.30 వరకు, వేమిరెడ్డి ఎంక్లేవ్, బంజారా గ్రీన్‌కాలనీ, ప్లెజెంట్ వ్యాలీ, పోలీస్ లైన్స్ ఫీడర్ల పరిధిలో 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14 ఫీడర్ పరిధిలో 10.30 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు, నందగిరిహిల్స్ ఫీడర్ పరిధిలో 11 గంటల నుంచి 11.30 గంటల వరకు, భారతీయ విద్యాభవన్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 వరకు, అపోలో ఆసుపత్రి ఫీడర్ పరిధిలో 12.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, జర్నలిస్ట్ కాలనీ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.30 వరకు, హనుమాన్ టెంపుల్, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 86 ఫీడర్ పరిధిలో 1.30 గంటల నుంచి 2 గంటల వరకు, ఎన్‌బీటీ నగర్ ఫీడర్ పరిధిలో 2.30 గంటల నుంచి 3 గంటల వరకు, కాకతీయ హిల్స్ ఫీడర్ పరిధిలో 3 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ తెలిపారు.

గ్రీన్ ల్యాండ్స్ పరిధిలో

గ్రీన్ ల్యాండ్స్ పరిధిలోని ఆదిత్య ఎంక్లేవ్, జయశంకర్ నగర్ ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మైత్రివనం, పెద్దమ్మ నగర్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు.

నేడు నీలిమా ఆస్పత్రిలో గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం

ఎర్రగడ్డ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నీలిమా ఆస్పత్రిలో గర్భిణులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆస్పత్రిలో ఎండీ నీలిమా శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుపేద గర్భిణులకు చేయూతను అందించడానికి 'నీలిమా9' పేరుతో ప్రతి నెలా 9వ తేదీన ఆస్పత్రిలో గర్భిణులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉచిత వైద్యశిబిరంలో పేరు నమోదు చేయించుకున్న గర్భిణులకు ఉచితంగా మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు.

మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో...

లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సనత్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ క్యాంప్ చైర్మన్ లయన్ ఏ కోటిరెడ్డి, కోచైర్మన్ ఎస్. అంజిరెడ్డి తెలిపారు. మోతీనగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో శనివారం ఉదయం 9 గంటల నుంచి శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్యులు అన్నిరకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామన్నారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి, ఇంటిగ్రో హాస్పిటల్, డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్‌ల సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నదీమ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని రాష్ట్ర అటవీ పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఓటరు జాబితా పరిశీలకుడు అహ్మద్ నదీమ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఓటరు జాబితా తయారీపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ముసాయిదా విడుదల చేశారన్నారు. ఆ జాబితాలో తప్పుల సవరణకు అవకాశం కల్పించారని, శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ ఉందన్నారు. డిసెంబరు 24న క్లెయిమ్ అండ్ అబ్జెక్షన్ పరిష్కరిస్తారని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జనవరి 1న తుదిజాబితా ప్రకటించి, జనవరి 6న విడుదల చేస్తారన్నారు. ఓటరు జాబితా తయారీలో పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. జనవరి 1, 2025 తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫీకర్‌అలీ, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, అజయ్‌కుమార్, నాయకులు రాజేష్ కుమార్, నందకుమార్ మమ్మద్ సోహెల్, శ్రీనివాస్, ఖాజా మొయినుద్దీన్, కొల్లూరు పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని అరికట్టడంలో విద్యార్థుల పాత్ర కీలకం

ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

పంజాగుట్ట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అవినీతి, లంచగొండితనం మితిమీరిపోయిందని వాటిని అరికట్టడంలో విద్యార్థుల పాత్ర కీలకమని ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వశాఖ సహకారంతో సమైక్య భారతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజేంద్రకుమార్ అధ్యక్షత వహించారు. మార్పు ఎక్కడి నుంచో కాదు మన నుంచే రావాలని, ప్రతి పౌరుడు బాధ్యతగా అవినీతిని నిర్మూలించడంలో కృషి చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజేంద్రకుమార్ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ డీఐ సైదులు, ఎస్ఐ నాగరాజు, సమైక్య భారతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వి.రవీందర్‌రెడ్డి, ఎన్. విజయలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ వి.వి. సుబ్బారావు, డాక్టర్ జగన్నాథరావు, డాక్టర్ గిరిధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఏ.బాలస్వామి, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎం.కోటేశ్వరరావు, అయూబ్ ఖాన్, కె. రామకృష్ణ, జి.బాలకృష్ణ పాల్గొన్నారు.



విజేతకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్

పంజాగుట్ట చౌరస్తాలో హోంగార్డును ఢీ కొట్టిన కారు

- ఆలస్యంగా వెలుగులోకి

పంజాగుట్ట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుండగా ఓ కారు హోంగార్డును ఢీకొట్టింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేటకు చెందిన సయ్యద్ మజుద్దీన్ నసీర్(20) బంజారాహిల్స్‌లోని ఎంజే కాలేజీలో చదువుకుంటున్నాడు. ఈ నెల 4న పంజాగుట్ట చౌరస్తాలో ట్రాఫిక్ ఎస్ఐ బి.ఆంజనేయులు, హోంగార్డు రమేష్, ఇతర సిబ్బందితో వాహన తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో వెర్నా కారు(ఏపీ09సిపి9664)లో వెళుతున్నాడు. కారు అద్దాలకు బ్లాక్ ఫిలిం ఉండడాన్ని గమనించిన పోలీసులు ఆపే ప్రయత్నం చేశారు. కారును ఆపుతున్నట్టే ఆపి వేగం పెంచగా కారు ముందు ఉన్న హోంగార్డు రమేష్‌ను ఢీ కొట్టి కొంత దూరం వెళ్లాడు. రోడ్డుపై వస్తున్న ఇతర వాహనదారులు వారి వాహనాలను మజుద్దీన్ నసీర్ కారుకు అడ్డంగా తీసుకురావడంతో తప్పించుకోవడానికి అస్కారంలేక కారును ఆపాడు. కారు నడుపుతున్న సయ్యద్ మజుద్దీన్ నసీర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని పంజాగుట్ట శాంతిభద్రతల విభాగం పోలీసులకు అప్పగించారు. ట్రాఫిక్ ఎస్ఐ రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓపెన్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

బంజారాహిల్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్(హట) ఆధ్వర్యంలో 19వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రారంభించారు. ఈ నెల 10 తేదీ వరకు జరుగనున్న పోటీలలో తెలంగాణ, ఏపీ, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారు. 30 ఏళ్ల వయసు నుంచి 70 ఏళ్ల క్రీడాకారులు సింగిల్స్ డబుల్స్‌గా పాల్గొంటారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి కార్యదర్శి కె. రాజేశ్వరరావు, హట సభ్యులు పాల్గొన్నారు

ఖైరతాబాద్‌లో 80 శాతం, జూబ్లీహిల్స్‌లో 74 శాతం

ఇంటింటి కుటుంబ సర్వేలో పూర్తికాని ఇళ్ల గుర్తింపు

ఖైరతాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సర్వేలో తొలి మూడు రోజుల్లో అన్ని ప్రాంతా ల్లో ఇళ్లను గుర్తించాలని అధికారుల ఆదేశాలు ఉన్నా ఇంకా పూర్తి కాలేదు. ఈనెల 6న ప్రారంభమైన ఇళ్ల గుర్తింపు 8వ తేదీవరకు ముగించాలని ఎన్యూమ రేటర్‌లకు, సూపర్‌వైజర్‌లకు ఇచ్చిన శిక్షణ సమయం లోనే అధికారులు ఆదేశించారు. అయితే ఖైరతాబాద్ సర్కిల్ (17)లో ఇళ్ల గుర్తింపు శుక్రవారం సాయంత్రం వరకు 80 శాతం పూర్తవగా, జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 74శాతం పూర్తయింది. ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు చీకటిపడ్డ ఇళ్ల గుర్తింపు పనులు కొనసాగుతున్నాయి. ఖైరతాబాద్ సర్కిల్‌లో 50వేలకు పైగా కుటుంబాలు ఉండగా, జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 57,195 కుటుంబాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇళ్ల గుర్తింపు శనివారం వరకు పూర్తిస్థాయిలో ముగిస్తామని అధికారులు పేర్కొన్నారు. కాగా శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ కుటుంబ వివరాలు సేకరించి ఆయన నివాసం వద్ద ఎన్యూమరేటర్ స్టిక్కర్‌ను అంటించారు. ఇందులో సర్కిల్ 17 ఏఎంసీ కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వే సిబ్బందిపై దాడి

బోయిన్‌పల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సర్వే చేస్తున్న ఓ మహిళా సిబ్బందిపై ఓ వ్యక్తి దాడికి దిగిన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంచారపురికాలనీలో చోటు చేసుకుంది. బోయిన్‌పల్లి ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ బోర్డు పరిధిలోని బోయిన్‌పల్లి 1వ వార్డు పరిధిలోగల సంచారపురి కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం సర్వే చేయడానికి ఓ ఇంటి వద్దకు వెళ్లి తలుపు తట్టింది. ఈ క్రమంలో బయటకు వచ్చిన ఆ ఇంటి యజమాని ఎవరని అడిగితే.. సర్వే కోసం వచ్చినట్లు ఆమె తెలిపింది. అంతలో ఆ యజమాని మహిళతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఆమెపై చేయిచేసుకున్నాడు. దీంతో సర్వేకు వెళ్ళిన మహిళ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలిపి వారి సహాయంతో బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు సదరు ఇంటి యజమానిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వచ్చిన సర్వే సిబ్బంది నిజమైన అధికారులేనా? అని సందేహం కలగడంతో వారిని ప్రశ్నించగా పొంతనలేని మాటలు మాట్లాడడంతో వారే తనపై దురుసుగా ప్రవర్తించడంతో తాను గట్టిగా ప్రశ్నించానని తెలిపాడు. గతంలో తమ ఇంటిలో దొంగతనాలు జరిగాయని.. దీంతో తమకు వారిపట్ల అనుమానం కలిగిందని పోలీసుల విచారణలో తెలపడం గమనార్హం.



జేబీఎస్ ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత : ఏసీపీ

మారేడుపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. శుక్రవారం జేబీఎస్‌లోని ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు సురేష్, చౌహాన్, కాలేశ్వర్‌తో పాటు 70 మంది డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి బకాయిదారులకు 10 శాతం రాయితీ

● ఈనెల 15 నుంచి డిసెంబర్ 31 వరకు సదుపాయం

సికింద్రాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంచినీటి బిల్లుల బకాయిల చెల్లింపు కోసం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ ప్రవేశపెట్టింది. వినియోగదారులకు బిల్లు మొత్తంలో 10 శాతం రాయితీ ఇవ్వాలని కంటోన్మెంట్ బోర్డు నిర్ణయించింది. ఈనెల 15 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్‌నాయక్ విజ్ఞప్తి చేశారు. కాగా గ్రేటర్‌లోని మిగతా ప్రాంతాల్లో వాటర్ బోర్డు ప్రవేశపెట్టిన మాదిరిగా కంటోన్మెంట్ పరిధిలో కూడా మంచినీటి బిల్లుల బకాయిల చెల్లింపు కోసం వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ ప్రవేశపెట్టి, అమలు చేయాలని శుక్రవారం జరిగిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి సమావేశంలో తీర్మానించారు. తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా కమాండర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎన్.వి.నంజుండేశ్వర అధ్యక్షతన జరిగిన సమావేశంలో కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ, ఎక్స్ అఫీషియో సభ్యుడు ఈటల రాజేందర్ (మల్కాజిగిరి ఎంపీ). ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్‌లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్‌పై నిర్ణయం తీసుకున్నారు.

19న మహిళా స్ఫూర్తి పురస్కారాలు

అడ్డగుట్ట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ, రోటరీ లయన్స్, వాసవి ఇతర కులసంఘాలలో, సాంస్కృతిక రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళలను ప్రోత్సహించేందుకు ఈనెల 19న బిర్లా ప్లానిటోరియంలో మహిళా ఇన్‌స్పైర్ అవార్డులను అందజేస్తున్నట్లు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ కమల మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజంలో మార్పు, మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్న మహిళలకు ఈ అవార్డులు అందజేస్తున్నామన్నారు. ఇంతకు ముందు వారు సేవ చేసిన ఫొటోలు ఉంటే 9392937486 నెంబరుకు వాట్సప్ మేసేజ్ చేయాలని కోరారు. బిర్లా ప్లానెటోరియంలో అందజేసే ఈ అవార్డులను తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళలకు అందజేస్తామన్నారు.

రూ.10 వేలు ఆర్థిక సాయం

అడ్డగుట్ట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్టకు చెందిన దివ్యాంగురాలు పద్మావతి అనారోగ్యంతో మృతి చెందడంతో దహన సంస్కారాల కోసం సాయి మంగ డిజిటల్ కంపెనీ యజమాని రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతురాలికి కొడుకు కూతురు ఉన్నారు. భర్త 10 నెలల క్రితం కాలం చేశారు. ఈ ఆర్థిక సాయం కళాజ్యోతి, సరిత, దయామణి చేతుల మీదుగా నగదు అందజేశారు.

ఎప్పటికి పూర్తయ్యేనో?

● వార్డు కార్యాలయం పనులో జాప్యం
● బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేసిన గుత్తేదారు



రెజిమెంటల్ బజార్‌లో నిర్మాణంలో ఉన్న వార్డు కార్యాలయం

రెజిమెంటల్ బజార్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ నిధులతో నిర్మిస్తున్న నూతన వార్డు కార్యాలయ నిర్మాణం పూర్తయితే తమ సమస్యలను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తే పరిష్కారం లభిస్తుందని ఆశించిన మోండా డివిజన్ ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. మోండా డివిజన్ రెజిమెంటల్ బజార్‌లో నిర్మిస్తున్న వార్డు కార్యాలయం పనులు ముందుకు సాగడం లేదు.

గత ఏడాది జనవరిలో ప్రారంభం అయిన వార్డు కార్యాలయం పనులు ఒక ఫ్లోర్ సివిల్ వర్క్ పూర్తయి.. ముందుకు సాగడం లేదు. డివిజన్‌లో ఏర్పడే సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేయాలంటే జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయానికి పరుగెత్తాల్సి వస్తోంది. తీరా అక్కడికి వెళ్లినా.. అధికారులు ఫీల్డ్ వర్క్‌పై వెళ్తే సమయం వృథా అవుతోంది. ఈ సమస్యలకు చెక్ పెట్టాలంటే వార్డు కార్యాలయం అందుబాటులోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

గతంలో టాయిలెట్లు ఉండేవి..

ప్రస్తుతం వార్డు కార్యాలయం నిర్మిస్తున్న స్థలంలో పబ్లిక్ టాయిలెట్లు ఉండేవి. కాలక్రమేణా వినియోగం తగ్గడంతో అవి నిరుపయోగంగా మారాయి. స్థానికుల ఫిర్యాదుతో జీహెచ్‌ఎంసీ టాయిలెట్లను తొలగించారు. తరువాత కార్యాలయ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు రావడంతో నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ శ్రీకారం చుట్టింది.

నూతన వార్డు కార్యాలయంలో..

నూతనంగా నిర్మిస్తున్న వార్డు కార్యాలయ భవనంలో ఇంజనీరింగ్, ఎంటమాలజీ, సానిటేషన్, హెల్త్, టాక్స్ శాఖలతో పాటు కార్పొరేటర్ కార్యాలయం కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ఆయా శాఖల అధికారులకు విన్నవించుకునే అవకాశం లభిస్తుంది.

కమ్యూనిటీ హాల్‌కు కేటాయించాలి

రెజిమెంటల్‌బజార్‌లో రెండు కమ్యూనిటీ హాల్‌లు ఉన్నప్పటికీ ఒక దానిలో పోలీస్ స్టేషన్ మరొకటి జీహెచ్‌ఎంసీ వినియోగించుకుంటోంది. దీంతో బస్తీవాసులు ఏ చిన్న ఫంక్షన్ చేసుకోవాలన్నా భారంగా మారింది. కనుక నూతన వార్డు కార్యాలయంపైన అదనంగా ఒక అంతస్తు నిర్మించి కమ్యూనిటీ హాల్‌కు కేటాయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మందుబాబులకు అడ్డాగా..

నిర్మాణంలో ఉన్న వార్డు కార్యాలయం మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. పాత సోఫాలను ఏర్పాటు చేసుకుని దర్జాగా మద్యం తాగుతున్నారు. గదిలో మద్యం బాటిల్లు, గ్లాసులు కుప్పలుగా పడిఉన్నాయి. డోర్లు, కిటికీలు లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

గుత్తేదారుకు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు చేయడం లేదని దీంతో జాప్యం అవుతోందని జీహెచ్‌ఎంసీ అధికారి తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో బిల్లుల చెల్లింపు కష్టంగా మారింది.. ఇంకా ఆలస్యం అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

త్వరగా పనులు పూర్తిచేయాలి



వార్డు కార్యాలయ భవనం పూర్తయితే డివిజన్‌లో ఏర్పడే సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేయడానికి ప్రజలకు అందుబాటులో ఉంటుంది. రూ.60 లక్షలు జీ ప్లస్ వన్ భవన నిర్మాణం కోసం మంజూరి అయినట్లు తెలిసింది. పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి

- గౌరిశంకర్, రెజిమెంటల్‌బజార్

జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశా



కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేసినట్లు తెలిసింది. జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లా. అధికారులతో మాట్లాడి నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటా

- కొంతం దీపిక, కార్పొరేటర్

మంచినీటి కోసం పోరాటం ఆగదు : రామకృష్ణ

సికింద్రాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మంచినీటి సరఫరా మెరుగు విషయమై రాష్ట్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతోందని, అందుకే మంచినీటి కోసం రేవంత్‌రెడ్డి సర్కారుపై బీజేపీ పోరాటం కొనసాగుతుందని కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. శుక్రవారం కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశం అనంతరం తన చాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఇతర ప్రాంతాల మాదిరిగా కంటోన్మెంట్‌లో కూడా రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయాలని తాము డిమాండ్ చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగా ప్రస్తుతం రేవంత్‌రెడ్డి సర్కారు కూడా టీపీటీ బకాయిల చెల్లింపు విషయంలో అన్యాయం చేస్తున్నదని రామకృష్ణ ఆరోపించారు.

13న ప్రత్యేక సమావేశం

కంటోన్మెంట్‌లో నీటి సరఫరా విషయమై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, బిల్లులు అధికంగా వస్తున్నాయన్న ఫిర్యాదులు, నీటి సరఫరాలో ఇబ్బందులు వాటి పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై ఈనెల 13వ తేదీన కంటోన్మెంట్ బోర్డు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని రామకృష్ణ వెల్లడించారు. ఫిర్యాదులేమైనా ఉంటే ఈనెల 12వ తేదీలోపు కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం దృష్టికి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రోడ్ల విస్తరణను 40 మీటర్లకు పరిమితం చేయాలి

● ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి లేఖ రాయాలని కంటోన్మెంట్ పాలక మండలి తీర్మానం



బ్రిగేడియర్ నంజుండేశ్వర అధ్యక్షతన జరిగిన కంటోన్మెంట్ పాలక మండలి సమావేశంలో పాల్గొన్న ఈటల రాజేందర్, రామకృష్ణ, మధుకర్

సికింద్రాబాద్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం కంటోన్మెంట్‌లో రోడ్ల విస్తరణను 40 మీటర్లకు పరిమితం చేయాలంటూ ప్రజా ప్రతినిధులు, ప్రజలు చేస్తున్న విజ్ఞప్తులను మరోసారి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం నిర్ణయించింది. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించి ప్యారడైజ్ నుంచి బోయినపల్లి చెక్‌పోస్టు వరకు, ప్యాట్నీ సెంటర్ నుంచి హకీంపేట్ వరకు రోడ్లు 60 మీటర్ల మేరకు విస్తరించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ అంశంపై పునరాలోచించాలని కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం కోరనుంది. శుక్రవారం తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా కమాండర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎన్.వి.నంజుండేశ్వర అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలతోపాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంపై విస్తృత చర్చ జరిగింది. ఎక్స్ అఫీషియో సభ్యుడు ఈటల రాజేందర్ (మల్కాజిగిరి ఎంపీ) మాట్లాడుతూ ప్రతిపాదిత రోడ్ల విస్తరణ వలన చాలా మంది నష్టపోనున్నారని, ఈ నేపథ్యంలో 40 మీటర్లకు మాత్రమే విస్తరించాలని కోరారు. కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ మాట్లాడుతూ కారిడార్ల నిర్మాణానికి తమకు ఏం కావాలో రాష్ట్ర ప్రభుత్వం అడుగుతున్నదని, అయితే బాధితుల నష్టపరిహారం, రోడ్ల విస్తరణ వలన డ్రైనేజీ వ్యవస్థకు కలిగే నష్టాన్ని భర్తీ చేయడంపై మాట్లాడడం లేదన్నారు. బ్రిగేడియర్ నంజుండేశ్వర జోక్యం చేసుకుంటూ రోడ్ల విస్తరణపై రాష్ట్ర ప్రభుత్వంతో మరోమారు సంప్రదింపులు జరుపుతామని, విస్తరణపై లేఖ రాస్తామని పేర్కొన్నారు.

రోడ్ల విస్తరణ వలన కంటోన్మెంట్ బోర్డుకు చెల్లించే రూ.303 కోట్ల పరిహారం బదులు, నాలాలను ఆధునీకరించాలని, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పనులను పూర్తిస్థాయిలో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి పాలక మండలి ప్రతిపాదించింది.

కంటోన్మెంట్‌లో కమ్యూనిటీ హాళ్లను అభివృద్ధి చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని ఈటల సూచించగా, తమ వద్ద నిధులు లేవని ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ తెలిపారు.

కేంద్రం నుంచి 900 కోట్ల మేరకు సర్వీసు చార్జీలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.50 కోట్ల మేరకు టీపీటీ బకాయిలు రావలసి ఉందని మధుకర్ నాయక్ చెప్పగా, ఢిల్లీ వెళ్లినప్పుడు సర్వీసు చార్జీల బకాయిల విషయాన్ని రక్షణ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళతానని ఈటల రాజేందర్ తెలిపారు.

కంటోన్మెంట్‌లోని వివిధ ప్రాంతాల్లోని 15 అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేయాలని, ముగ్గురు అధికారులకు పదోన్నతి కల్పించే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సమావేశంలో తీర్మానించారు.

నర్సింగ్ హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి



బోయగూడలోని నర్సింగ్ హాస్టల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమలత

పద్మారావునగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ హాస్టల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని బన్సీలాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ కుర్మ హేమలత అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి బోయగూడలోని నర్సింగ్ హాస్టల్‌ను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. హాస్టల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేని కారణంగా కొంతకాలంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను నిశితంగా పరిశీలించానని, విద్యార్థులు గదులలో ఉండలేని పరిస్థితి నెలకొనిఉందని అన్నారు. వెంటనే ఈ సమస్యను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకొస్తానని తెలిపారు.

నర్సింగ్ హాస్టల్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

అడ్డగుట్ట,, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ బోయగూడలోని గాంధీ ఆస్పత్రి నర్సింగ్ విద్యార్థులు ఉండే నర్సింగ్ హాస్టల్ లో రెండు నెలల నుంచి డ్రైనేజీ దుర్వాసనతో భరించలేకపోతున్నామని గురువారం నర్సింగ్ హాస్టల్ నుంచి గాంధీ ఆస్పత్రికి కాలినడకన వచ్చి ఆస్పత్రి ముందు నర్సింగ్ విద్యార్థులు నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి ఆదేశాల మేరకు స్పందించి గాంధీ ఆస్పత్రి నర్సింగ్ వైస్ ప్రిన్సిపల్ ఇందిర అపరిశుభ్రతను వెంటనే శుభ్రం చేయించారు.

భక్తిశ్రద్ధలతో మహారుద్రయాగం



శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహారుద్రయాగంను నిర్వహిస్తున్న వేదపండితులు

బౌద్ధనగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుపాదమండపంలో శుక్రవారం శ్రీమహారుద్రయాగం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. వేదపండితుడు రాధాకృష్ణశర్మ బ్రహ్మత్వంలో 25 మంది రుత్వికుల నేతృత్వంలో మహాన్యాసం, ఏకాదశ రుద్రపారాయణం, అభిషేకం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం వరకు ఈ మహారుద్రయాగంను నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్‌బోర్డు అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేశ్‌కుమార్ తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక దీపోత్సవం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శనివారం రెండోరోజు నిర్వహించే మహారుద్రయాగ క్రతువులో పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్ధండ విద్యాశంకర భారతీ మహాస్వామి పాల్గొంటారని, ఉదయం 11గంటలకు ఆయన భక్తులకు ఆశీస్సులతో పాటు అనుగ్రహభాషణం చేస్తారని తెలిపారు. ఆలయ నిర్వాహకులు బాలభాస్కర్, ఆత్మరామసూర్యసుబ్రహ్మణ్యం, శివశంకరణ్, షన్ముఖరెడ్డితో పాటు భక్తులు పాల్గొన్నారు.

స్కందగిరిలో ఘనంగా స్వామి కల్యాణం



వెండి రథంపైన స్వామివారి ఊరేగింపు

పద్మారావునగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఘనంగా శ్రీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం, స్కంద షష్ఠి మహోత్సవంలో భాగంగా శుక్రవారం పద్మారావునగర్ స్కందగిరి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కళ్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు ప్రత్యేక పూజ, కళ్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. అనంతరం ఉత్సవ మూర్తులను వెండి రథంపైన ఊరేగించారు. ఆలయ ఛైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మేనేజింగ్ ట్రస్టీ కృష్ణన్ రాజమణి పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న స్కౌట్స్ కమిషనర్ శ్రీధర్

పద్మారావునగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్కౌట్స్ అండ్ గైడ్స్ సికింద్రాబాద్ జిల్లా కార్యాలయంలో వివిధ రకాల పోటీలను నిర్వహించారు. క్విజ్‌లో మొదటి బహుమతి, బ్యాండ్ పార్టీ స్పెషల్ అవార్డులను బన్సీలాల్‌పేట్, భోలక్‌పూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాల విద్యార్థులకు స్కౌట్ జిల్లా కమిషనర్, డిప్యూటీ ఈఓ శ్రీధర్ అందజేశారు.

ఆటను ఆస్వాదించాలి : కార్పొరేటర్ సుచిత్ర



ఖో ఖో పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుచిత్ర

రాంగోపాల్‌పేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత కాలంలో అమ్మాయి, అబ్బాయి అని తేడాలేకుండా పిల్లలందరూ ఆటలు ఆడుతున్నారని క్రీడాకారులందరూ ఆటను ఆస్వాదించాలని రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర అన్నారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖో ఖో లీగ్ పోటీలను శుక్రవారం సికింద్రాబాద్ పీజీ రోడ్డులోని వెస్లీ బాయ్స్ హైస్కూల్ మైదానంలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుచిత్ర మాట్లాడుతూ.. క్రీడలపై తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి 10 జిల్లాల నుండి జూనియర్ కళాశాలల బాలురు, బాలికలు పది పది జట్లుగా ఈ లీగ్ పోటీలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఒడ్డెన్న, వెస్లీ ఇంటర్ కళాశాల ప్రిన్సిపల్ యోహాన్, వెస్లీ బాయ్స్ హై స్కూల్ ప్రిన్సిపాల్ రూత్ సుప్రియ, 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 కార్యనిర్వాహక కార్యదర్శి జక్కన, బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్, మహాకాళి సికింద్రాబాద్ జిల్లా అధికార ప్రతినిధి అశ్విని భైరిషెట్టి, నాయకులు పులి మదన్, శ్రీధర్, నరేంద్ర పాల్, జై కిషన్ తదితరులు పాల్గొన్నారు.



హెల్మెట్ ధరించిన వాహనదారులకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ మధుబాబు

సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడపొద్దు: ఇన్‌స్పెక్టర్

తిరుమలగిరి నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ వాడుతూ వాహనాన్ని నడపరాదని తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు వాహనదారులను హెచ్చరించారు. శుక్రవారం ట్రాఫిక్ నిబంధనల గురించి రాజీవ్ రహదారిలో వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న కొందరు వ్యక్తులను గుర్తించి తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు తరలించి వారిని హెల్మెట్‌లను వారి ద్వారా కొనుగోలు చేయించి ధరించేలా చేశారు. సంతృప్తి చెందిన ఇన్‌స్పెక్టర్ వారికి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. పౌరులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సెల్‌ఫోన్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపకూడదని వారికి సూచించారు. రాంగ్ రూట్‌లో వెళ్లి ప్రమాదాలు తెచ్చుకోకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ పీఎస్సై రమేష్ పాల్గొన్నారు.



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తార్నాకలోని తన క్యాంపు కార్యాలయం ఆవరణలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రామ్‌లాల్, ప్రవీణ్ లాల్, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, శ్యామల రమణి, నరసింహ, జల్లబాబు తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి



బేగంపేటలోని పాఠశాలలో సీఎం పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సత్యం శ్రీరంగం, అమరం శ్రీనివాస్‌రెడ్డి



ప్రకాశ్‌నగర్‌లో రక్తదానం చేస్తున్న కాంగ్రెస్ నేత విశాల్ సూదం తదితరులు

- బేగంపేట, ఆంధ్రజ్యోతి



సీఎం జన్మదినోత్సవం సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు సి.బద్రీనాథ్ యాదవ్ సికింద్రాబాద్‌లోని వృద్ధాశ్రమంలో మందులు, పండ్లు, భోజనం పంపిణీ చేశారు.

-హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నరసింహన్

తిరుమలగిరి నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు బొల్లారం చింతల్ బజార్‌లో టీపీసీసీ కార్యదర్శి కే.నరసింహన్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ అరవింద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి.

కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ఆరు గ్యారంటీల పథకాన్ని అమలు చేసి చరిత్ర సృష్టిస్తున్నారని నరసింహన్ అన్నారు. పేద వర్గాలకు సంక్షేమ పథకాలను అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జీవీ. బాల్‌రాజ్, సతీష్, సుశీల్ రషీద్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.